జాతీయ చేనేత అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, మే 8: జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం కింద 2023 సంవత్సరానికి గాను సంత్ కబీర్, జాతీయ చేనేత అవార్డు కొరకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చేనేత జౌళి దుస్తుల ఎగుమతి శాఖ సంచాలకుడు డాక్టర్ అలుగువర్షిణి ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అవార్డు కోసం నేత విభాగంలో విజేతలకు మూడు అంచెల ఎంపిక ద్వారా ఖరారు చేస్తామన్నారు. ఇతర వివరాలకు ఆన్‌లైన్‌లో www.handlooms.nic.inలో సంప్రదించాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు గడువు పెంపు

కాగజ్‌నగర్ టౌన్, మే 8: ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవటానికి ఈనెల10 వరకు గడువును పెంచినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ కేంద్రాల్లోని ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

11న బీజేపీ సన్నాహక సమావేశం

బెజ్జూరు, మే 8: మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఈనెల11న బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహి స్తున్నట్లు ఆపార్టీ నాయకులు బాలకృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాటుసారా స్వాధీనం

దహెగాం, మే 8: మండలంలోని ఐనం గ్రామంలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి అయిదు లీటర్ల నాటుసారా స్వాధీన పర్చుకున్నారు. అదే విధంగా కమ్మర్‌పల్లి గ్రామంలో వెయ్యిలీటర్ల బెల్లం పానకంను ధ్వంసం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

లోక్‌సభ పోరు..

ప్రచార హోరు



కాగజ్‌నగర్, మే 8: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గడువు సమీపిస్తుండటంతో ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో ఆయా అసెంబ్లీ నియోజవర్గాల నుంచి ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రధాన పార్టీల నాయకులు దృష్టి సారిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభావంచూపే సామాజికవర్గాలను కూడ గట్టుకునేందుకు అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు.

క్యాడర్‌ను కాపాడుకుంటూ..: బీఆర్ఎస్

జిల్లాలో బీఆర్ఎస్ నుంచి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి తన క్యాడర్‌తో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చేపట్టిన పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలిపించాలని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఈ పార్టీలోని కీలక నాయకులంతా కూడా కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అయినప్పటికీ కూడా ఉన్న క్యాడర్‌ను కాపాడుకుంటున్నారు. ఇన్నాళ్లు తమ పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలను ఫోన్లు చేసి యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. ప్రధాన నాయకులంతా కూడా ఉదయం పల్లెబాట పట్టి రాత్రికి కాగజ్‌నగర్‌కు చేరుకుంటున్నారు.

ఆరు గ్యారంటీలతో..: కాంగ్రెస్

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ కీలక అంశాలైన ఆరుగ్యారంటీలతో ముందుకు వెళ్లుతూ ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలింపించాలని కోరుతున్నారు. మంత్రి సీతక్కతోపాటు మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రావిశ్రీనివాస్ కలిసి ఇతరపార్టీల నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. కార్నర్ మీటింగ్‌లను నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓటర్లను ఆకట్టుకుంటూ ముందడుగు వేస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల కుప్పలను వివరిస్తున్నారు. బీజేపీ తీరును ఎండగడుతున్నారు. ఆసిఫాబాద్‌లో నాలుగు రోజుల క్రితం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరై బీఆర్ఎస్, బీజేపీలపై విమర్శలు గుప్పించారు. ఆదివాసీ ఆడబిడ్డ ఆత్రం సుగుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు పోతాయన్న అంశాన్ని ప్రజల్లోకి దూసుక పోయేట్లు చేశారు.

ఓటర్లను ఆకట్టుకునేందుకు 'అమిత్ షా'..: బీజేపీ

బీజేపీలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుతోపాటు ఉమ్మడి జిల్లా నాయకులు జిల్లా ఓటర్లను ఆకట్టుకునేందుకు, ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను గెలిపించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో అధిక మెజార్టీ సీట్లు రాగా సిర్పూరు నియోజకవర్గం మాత్రం బీజేపీ ఖాతాలోకి వచ్చింది. బీజేపీ బలంగా ఉన్న ఈ ప్రాంతాల్లో ఒక్క ఓటు పోనీయకుండా ప్రచారం చేస్తున్నారు. కాగజ్‌నగర్ ఎస్పీఎం క్రీడా మైదానంలో ఆదివారం కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షాతో వికాస్ సంకల్ప సభను పెట్టించారు. ఈ సారి 400 పార్ పక్కా అంటూ ప్రధాన ఎజెండాతో ప్రజల్లో దూసుకు పోతున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఆయా మండలాల్లో కార్నర్ సమావేశాలు పెట్టి ఓటింగ్ పెంచేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు క్యాడర్ పార్టీ క్యాడర్‌ను పెంచేందుకు అడుగులు వేస్తున్నారు. తాము రిజర్వేషన్లను తొలగించమంటూ పేర్కొంటూ కాంగ్రెస్‌కు కౌంటర్ ఇస్తూ మోదీ చేసిన అభివృద్ధిని చూసి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీని గోడం నగేష్‌ను గెలిపించాలని కోరుతున్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



కాగజ్‌నగర్: సీతానగర్‌లో నెలకొరిగిన వరి పంట



దహెగాంలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పంట

కాగజ్‌నగర్, మే 8: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో మంగళవారం అకాలవర్షం కురిసింది. మండలంలోని సీతానగర్,నామానగర్, వివిధ క్యాంపుల్లో వేసిన యాసంగి వరిపంటకు అపార నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన వరిపంట పూర్తిగా నేలమట్టమైంది. అలాగే మామిడి తోటలకు కూడా అపారంగా నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. అధికారులు స్పందించి నష్టాలను అంచనా వేసి పరిహారం అందేలా కృషి చేయాలని అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. వ్యవసాయశాఖ అధికారులు వెంటనేపంటనష్టం సర్వేచేపట్టాలని రైతులు కోరుతున్నారు.

దహెగాం: మండలంలో మంగళవారంరాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని పీకలగుండ, అయినం, దహెగాం గ్రామాల్లో వరిపంట నేలకొరిగింది. జెండాగూడ గ్రామలో ఇంద్రసేన్, చంద్రసేన్ ఇళ్ల పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన వరిధాన్యం తడిసి ముద్దయింది. అధికారులు నష్టం అంచనావేసి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఏకం కావాలి

● రాజ్యంగాన్ని కాపాడుకోవాల్సిన అవరసరం ఉంది ● రౌండ్ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

ఆసిఫాబాద్, మే 8: రాజ్యంగం ప్రమాదంలో ఉందని, దాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వచ్చిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో టీజేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రమాదంలో ప్రజాస్వామ్యం" అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సమస్యలు చాలా ఉన్నాయని మాకు సీట్లు ఇవ్వండి రాజ్యంగాన్ని మార్చేస్తామని చర్చ జరుగు తోందన్నారు. రాజ్యంగం ద్వారా అన్ని వర్గాలను మనుషులుగా బతికేలా ఒక వేదికగా నిలిచిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో అసమానతలు పెరిగాయన్నారు. అదాని, అంబానీల ఆస్తులు కోట్లలో పెరిగాయని కానీ దేశానికి అన్నం పెట్టే రైతు పరిస్థితి మాత్రం అలాగే ఉందన్నారు. వ్యవసాయం కుంటుపడి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంతో బతికే పరిస్థితి లేదని పట్టణాలలో సెక్యూరిటీ గార్డు పని చేసింది నయమని రైతులు వాపోతున్నారన్నారు. కార్పోరేట్ వ్యవస్థను బతికించేలా ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు.

ఈ పరిస్థితి పోవాలంటే రాజ్యాంగ పరిరక్షణ ఒకటే సాధ్యమన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఈ ఎన్నికల్లో ఏం చేయాలనే నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు ఇండియా కూటమికి ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టు మునీర్, రవిందర్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, టీజేఎస్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు బాబన్న, ఆయాసంఘాల నాయకులు డాక్టర్ రమేష్, అబ్దుల్లా, ఓదెలు, శ్యాం, కార్తీక్, దినకర్, చిరంజీవి, చిన్నన్న, ఆసీఫ్, అసద్, వసంత్ రావు, మారుతి, చాంద్‌పాషా, మాలశ్రీ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

జరభద్రం..!

● వినోదం.. కాకూడదు విషాదం.. ● ప్రాణాలు తీస్తున్న ఈత సరదా

● జాగ్రత్తలు పాటించాలి



ఈత కొడుతున్న చిన్నారులు

ఆసిఫాబాద్, మే 8: విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చాయి. దీంతోవారంతా తమ ఊళ్లకు వెళ్లి ఉత్సాహంగా గడపాలని అనుకుంటారు. సరదా కోసం మిత్రులతో కలిసి ఈతకు వెళ్లాలనుకుంటారు. చెరువులు, వాగులు, కాలువల్లో దూకి కేరింతలు కొట్టాలనుకుంటారు.

ఈత సరాదా పిల్లల ప్రాణాలను బలి తీసుకుంటుంది. ప్రాజెక్టులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్తున్నవారు విగతజీవులుగా మారి తల్లిదండ్రులకు గర్భకోశాన్ని మిగిలిస్తున్నారు. అవగాహన లేమితో ప్రాజెక్టులు, చెరువుల లోతును సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. నీటిలో పెరిగిన నాచు, మొక్కలు కాళ్లకు తగిలి నీటిలో ఊపిరాడక మృతి చెందుతున్నారు. పిల్లలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి..

-సత్యనారాయణ, వైద్యుడు, ఆసిఫాబాద్



తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను ఓ కంట కనిపెట్టి ఉండాలి. సాధ్యమైనంత వరకు స్నేహితులతో ఈతకు పంపకపోవడమే మంచిది. పిల్లలకు ఈత పై ఆసక్తి ఉంటే స్వయంగా స్వీయ పర్యవేక్షణలో నేర్పించాలి. ఈతకు వెళ్లి ప్రమాదానికి గురైతే బాధితుడిని ఒడ్డుకు చేర్చిన తర్వాత వెల్లకిలా పడుకోబెట్టాలి. అవసరమైతే కృత్రిమశ్వాస అందించాలి. చాతిపై చేతులతో ఒత్తాలి. దీనివల్ల శ్వాస పెరుగుతుంది. తర్వాత దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్లాలి.

పిల్లలను కనిపెట్టుకుని ఉండాలి..

అవగాహన లేమి, నీటి లోతు తెలియకపోవడం, వచ్చిరాని ఈత, స్నేహితుల మధ్య సరదాగా పెట్టుకునే పోటీలు చిన్నారుల మృత్యువుకు కారణమవుతున్నాయి. వేసవిసెలవుల్లో పిల్లలు ఎక్కువగా ఈతకు వెళ్లే అవకాశం ఉండటంతో పెద్దలు గమనించాలి. వేసవితాపం నుంచి ఉపశమనం కోసం చాలా మంది పిల్లలు ఈత కొట్టేందుకు వెళ్తుంటారు. బావులు, చెరువుల వద్దకు వెళ్తామంటే తల్లిదండ్రులు తిడతారనే భయంతో కొందరు చెప్పకుండానే స్నేహితులతో కలిసి ప్రమాదాల బారిన పడుతుంటారు. ఈ విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వేసవిలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఓకంట కనిపెట్టి ఉండాలి. ఇంటినుంచి బయటకువెళ్లే పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. స్నేహితులతో ఈతకు వెళ్లే ముందు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని సూచించాలి. ఈతరాని పిల్లలపై మరింత జాగ్రత్తగావ్యవహరించాలి. ఎందుకంటే ఈత సరదా, తోటి మిత్రుల ప్రోత్సాహం వారిని నీటివైపు లాక్కుని పోతుంది. ఈతసరదా ఉన్న పిల్లల ఆసక్తిని గమ నించి తామే స్వయంగా స్వీయ పర్య వేక్షణలో నేర్పిం చడం మంచిది. సాధ్యమైనంత వరకు స్నేహితులతో ఈతకు పంపకపోవడమే మంచిది.

దూకేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి..

జలాశయాల్లో ఈత కొట్టేందుకు పైనుంచి దూకే సమయంలో కాళ్లు మొదటగా నీటిని తాకేలా చూసుకోవాలి. తలకిందులుగా దూకడం ప్రమాదకరం. క్వారీ గుంతల అడుగుభాగంలో బండలు, రాళ్లు ఉంటాయి. లోతును ముందుగానే అంచనా వేయకపోతే నీటమునిగే ప్రమాదం ఉంది. ఒకరిపై మరొకరు దూకితే పెద్ద ప్రమాదం జరుగుతుంది.

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న అదనపు కలెక్టర్



ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, మే 8: ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌కేంద్రంలో బుధవారం అదనపుకలెక్టర్ దీపక్ తివారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్ వినియోగించుకోవాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 8: జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 127మంది దరఖాస్తు చేసుకోగా 122మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. అలాగే ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 29మంది దరఖాస్తు చేసుకోగా 29మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల10వరకు పోస్టల్ బ్యాలెటింగ్‌ను పొడిగించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి 2420మంది దరఖాస్తు చేసుకోగా 2039మంది ఉద్యోగులు ఓటువేశారని, సిర్పూర్ నియోజకవర్గంలో 1415మందికి గాను 1246మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. మరో రెండు రోజులు అవకాశం ఉన్నందున ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా శ్రీనివాస్ రెడ్డి

జైనూర్, మే 8: మండల ఇన్‌చార్జి ఎంపీవోగా శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీక రించారు. ఇంతకు ముందు ఇక్కడున్న ఎంపీవో ప్రభుదయ అనారోగ్యానికి గురికావడంతో ఆయనసెలవులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టి శ్రీనివాస్ రెడ్డికి సిబ్బంది శాలువ కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మండల వాసులకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దహెగాం, మే 8: నకిలీ పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలోని అయినం, చిన్నరాస్పెల్లి, దహెగాం, ఒడ్డుగూడ గ్రామాల్లో ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ నిలువల రిజిస్టర్‌ను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే రైతులకు రశీదులు అందజేయాలన్నారు. పత్తి, వరి, కంది విత్తనాలు విక్రయిస్తే రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎంఏవో వంశీకృష్ణ, ఏఈవోలు ఉన్నారు.

రైతులు అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, మే 8: అకాల వర్షాలతో రైతులు తమ పంట ఉత్పత్తులను కాపాడుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం దహెగాం మండలంలోని లగ్గాం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు టార్పాలిన్‌లు అందించాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే రైస్‌మిల్లర్లు, కోతలు విధించకుండా చర్యలు చేపడుతా మన్నారు. ఆయనవెంట ఏవో వంశీకృష్ణ, ఏఈవోలు, సీఈవో బక్కయ్య, ఇన్‌చార్జి నారాయణ, జీవన్‌చారి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఆసిఫాబాద్, మే 8: ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం బీజేపీనాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లాఅధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం బూర్గుడలో నాయకులు, కార్యకర్తలతో కలిసిసమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట్నాక విజయ్, విశాల్, సుచిత్ తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గుంతలమయంగా రోడ్డు

సిర్పూర్(టి), మే 8: మండల కేంద్రంలోని కాగజ్‌నగర్- కౌటాల ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ప్రతిసారి వర్షం పడినప్పుడల్లా గుంతల్లో వర్షపునీరు చేరి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రహదారి గుండా అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ రోడ్డు విషయాన్ని పట్టించుకోవడం లేదు.



గుంతలతో అధ్వానంగా ప్రధాన రహదారి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

జైనూర్, మే 8: మండలంలోని పోచంలొద్దిలో మంత్రి సీతక్క బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ఉయిక చందన్‌శావ్ అధ్వర్యంలో సుమారు 2వందలమంది బీఆర్ఎస్, ఆదివాసీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆత్రం సుగుణను నిండు మనసుతో ఆశీర్వదించి కాంగ్రెస్‌పార్టీ చేతిగుర్తుకు ఒటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఉపాధి కూలి రూ.400

జైనూర్: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు రోజుకు రూ.400 వేతనం ఇస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ అన్నారు. మండల కేంద్రం పరిసరాల్లో ఉపాధి కూలి పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే మొదట ఉపాధిహామీ పథకాన్ని అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆపార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యుబ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ రాథోడ్‌రమేష్, పెందుర్ ప్రకాష్ పాల్గొన్నారు.

లోక్‌నాథ్ బాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్, మే 8: కాగజ్‌నగర్ ఎఫ్‌కాలనీలోని లోక్‌నాథ్‌బాబా ఆలయంలో రెండవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పూజలుచేశారు. అనంతరం హోమ చేశారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జోరుగా పార్టీల ప్రచారం

సిర్పూర్(టి), మే 8: మండలంలోని గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు బుధవారం జోరుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తమ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆది జాంబవంతుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

మందమర్రిటౌన్, మే 8 : ఈ నెల 9న మందమర్రిలోని శ్రీకృష్ణ ఫంక్షన్‌హాలులో జరిగే ఆది జాంబవంతుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆది జాంబవంతుల సంఘం అధక్ష, ప్రధాన కార్యదర్శులు వాసాల శంకర్, బిదునూరి శంకర్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సమ్మేళనానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని రెండున్నర దశాబ్దాలుగా పోరాడుతున్నా బీజేపీ, బీఆర్‌ఎస్‌లో పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజనర్సు, రాజన్న, శంకర్, కొమురన్న, భీమన్న, రాజారం, పోశం, నంబయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకే మద్దతు

నస్పూర్, మే 8 : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేకు మద్దతు ఇస్తున్నట్లు ప్రజారాజ్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సల్లూరి మహేష్ అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ప్రజారాజ్య సమితి ఎంపీ అభ్యర్థి దుర్గం సంతోష్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడారు. తాము బరిలో ఉన్న ప్రచారం చేయడం లేదని, బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నట్లు తెలిపారు. నేతకాని సామాజిక వర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నేతకాని కులస్తులందరూ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని కోరారు. అనపర్తి యువరాజ్, జుమ్మిడి గోపాల్, కొండగోర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

చెన్నూరు, మే 8 : బీజేపీ మండల అధ్యక్షుడు మోర్ల శంకర్ ఆధ్వర్యంలో మండలంలోని ఆస్నాద గ్రామంలో బుధవారం కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల పార్టీల నుంచి సుమారు 20 మంది కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరారు. దుర్గం అశోక్, రమేష్, వెంకటన్న, సమ్మయ్య పాల్గొన్నారు.

ముగిసిన బీరన్న ఉత్సవాలు

కాసిపేట, మే 8 : మండలంలో వారం రోజులుగా జరుగుతున్న బీరన్న ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బీరన్న కల్యాణం ఘనంగా జరగగా, బుధవారం నిర్వహించిన బీరన్న నాగవెల్లితో ఉత్సవాలు ముగిశాయని పూజారులు తెలిపారు. శ్రీకృష్ణ యాదవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు, నీల్వాయిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

శ్రీరాంపూర్, మే 8: శ్రీరాంపూర్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం కొత్తరోడ్డులోని సాయినగర్, హన్మాన్‌నగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ సంతోష్ పేర్కొన్నారు. ఎన్నికల గురించి ప్రజలకు వివరిస్తూ, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. పోలీసు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: నీల్వాయి, వేమనపల్లి గ్రామాల్లో బుధవారం చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వారందరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్, పోలీసులు, టీఎస్‌ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలోని సీతారాంపల్లిలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి ప్రారంభించిన సీసీసీ కార్నర్ మీదుగా గోదావరి రోడ్డు నుంచి ప్రశాంత్‌నగర్ మీదుగా సీతారాంపల్లి చేరుకుంది. రూరల్ సీఐ ఆకుల అశోక్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు హక్కును తప్పని సరిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఫ్లాగ్ మార్చ్ చేస్తున్నామన్నారు. ఎస్సై రవి కుమార్, స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



బెజ్జూరులో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జూరు, మే 8: మండలంలోని పలుగ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామి పనులు జరిగే చోట కూలీలను కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాహీర్‌అలీ, నరేందర్‌గౌడ్, జావీద్, మహేష్, షౌకత్ అలీ పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పెంచికలపేట: మండలంలోని ఎల్లూరు, ఎల్కపల్లి గ్రామాల్లో పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సగుణక్కకు మద్దతుగా బుధవారం కాంగ్రెస్ నాయకులు గడపగడపకు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి, సాజిత, రాజన్న, కైరత్, రాకేష్ పాల్గొన్నారు.

నిఫా రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ రూరల్, మే 8: నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్స్ (నిఫా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌లోని ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ నియామకమయ్యారు. డిల్లీలో జరిగిన నిఫా జాతీయకార్యవర్గ సమావేశంలో కొలగాని శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు స్వచ్ఛంద, సామాజిక కార్యక్రమాలు చేపడుతూ నిఫా ఆర్గనైజేషన్‌లో భాగస్వామినైనందుకు సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన నిఫా జాతీయ నాయకత్వానికి కృతజ్ఞ తలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిఫా ఆధ్వర్యంలో స్వచ్ఛంద, సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్ట డానికి కృషి చేస్తానన్నారు. నిఫా జాతీయకార్యవర్గ సమావేశాల అనంతరం డిల్లీలోని రాష్ట్రపతి భవన్‌ను సందర్శించారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

ఏసీసీ, మే 8 : హత్యాయత్నం కేసులో మంచిర్యాల అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి నిందితునికి 5 ఏండ్ల సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయాల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు. మంచిర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబానగర్‌కు చెందిన సంద్ర అనిల్ కూలీ పనులు చేసేవాడు. 2016 సెప్టెంబరు 17న అనిల్‌ను మనుబోతుల భీమక్క, కూతురు లక్ష్మీలు కూలీ పనుల గురించి మాట్లాడు తుండగా భీమక్క కొడుకు శ్రీనివాస్ మా ఇంటికి ఎందుకు వచ్చావని అనిల్‌ను కొట్టాడు. అనిల్ తండ్రి లక్ష్మణ్, సోదరుడు అశోక్‌లు విడిపిస్తుండగా లక్ష్మణ్, అశోక్‌లను మనుబోతుల శ్రీనివాస్ కత్తితో దాడి చేశాడు. అనిల్ తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ వేణుగోపాలరావు నిందితున్ని అరెస్టు చేసి చార్జీషీటు దాఖలు చేశారు. లైజన్ ఆఫీసర్లు గులం దస్తగిరి, మరియన్‌రాజుల సహకారంతో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మదన్ మోహన్‌రావు సాక్ష్యులను ప్రవేశ పెట్టి వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో జడ్జి మనుబోతుల శ్రీనివాస్‌కు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

చెన్నూరు, మే 8: మండలంలోని నాగాపూర్ గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఏపీవో గంగాభవానీ పరిశీలించారు. కూలీల హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి వంద రోజులు పని కల్పించడం జరుగుతుందని, రోజుకు రూ. 300 చెల్లిస్తున్నామన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు త్వరగా పనులను పూర్తి చేసుకుని ఇండ్లకు వెళ్లాలని సూచించారు.

మతోన్మాద బీజేపీకి గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న రామడుగు లక్ష్మణ్

తాండూర్, మే 8: మతోన్మాద బీజేపీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పదేళ్ళ కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రైతులు, ప్రజల వ్యతిరేక విధానాలను అవలంభించిందన్నారు. బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలన్నారు. రేగుంట చంద్రశేఖర్, బయ్య మొగిలి, శంకర్, ఆనంద్, సత్యనారాయణ, నాగరాజు, దుర్గయ్య, రమేష్, పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



రేవంత్‌రెడ్డి, వివేక్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నేతకానీలు

కోటపల్లి, మే 8 : నేతకాని కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడంతో బుధవారం మల్లంపేటలో నేతకాని మహర్ కుల సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. నేతకాని కార్పొరేషన్ ఏర్పాటుతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు దుర్గం నరేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. రాంటెంకి పోశం, తాళ్ల బాపు, ఎన్నం భాస్కర్, సంపత్, ఈశ్వరి, రమాదేవి, నగేష్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

కుర్రెఘడ్ కన్నీటి చావులకు 14 ఏళ్ళు



పురోగతి లేని పునరావాస కాలనీ
ఇళ్లు, సాగు భూమిలేక అవస్థలు..
పట్టించుకోని అధికారులు

కాసిపేట, మే 8 : అన్నం లేక ఆకలి చావు ఘటనలు వినే ఉంటాం. కానీ తాగునీరు లేక ఏడుగురు చనిపోయిన సంఘటన కాసిపేట మండలం కుర్రెఘడ్‌లో 14 ఏండ్ల క్రితం జరిగింది. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. 2010లో తాగునీరు లేక ఏడుగురు మనుషులతో పాటు 30 వరకు మూగ జీవాలు మృతిచెందాయి. మే 7న జరిగిన ఈ సంఘటన మూడు రోజుల తర్వాత బాహ్య ప్రపంచానికి తెలిసింది. అప్పటి బెల్లంపల్లి ఎమ్మెల్యే దివంగత గుండ మల్లేష్ చొరవతో నీళ్ల ట్యాంకర్లు పంపించడంతో పాటు గ్రామానికి మెడికల్ కిట్‌లు, ఆహారంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కుర్రెమఢ్‌కు చేరుకున్నారు. వైద్య సేవలు చేసిన అనంతరం కుటుంబాలను మల్కేపల్లి ఆశ్రమ పాఠశాలకు తరలించారు. బాధిత కుటుంబాలకు వెంకటాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో పునరావాస కాలనీ ఏర్పాటు చేశారు. 14 ఏండ్లుగా పునరావాస కాలనీలో ఎలాంటి పురోగతి లేకపోవడంపై బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మైదాన ప్రాంతానికి తీసుకువచ్చిన అధికారుల వల్ల ఉపాధి లేక అవస్థలు పడుతున్నా మన్నారు. ఇప్పటికైనా పునరావాస కాలనీలో సౌకర్యా లు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

సంఘటన జరిగింది ఇలా...

కాసిపేట మండలంలో సోనాపూర్ పంచాయతీలో గుట్టలపైన దట్టమైన అడవిలో 18 గిరిజన కుటుంబాలు నివాసం ఉండేవి. 2010లో ఎండల తీవ్రత ఎక్కువగా పెరిగిపోయి గుట్టపై ఉన్న కుంటలు, బావులు, భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. మంచినీటి కోసం రెండు కిలోమీటర్లు గుట్ట కిందకు వస్తేనే తాగునీరు దొరికేది. రెండు రోజుల వ్యవధిలో తాగునీరు దొరకక కుర్సెంగ పాల్కుబాయి (29), ఆత్రం లచ్చుబాయి (25), వల్క శేఖర్ (20), కుర్సెంగ మోహన్ (6), కుర్సెంగ నేతుబాయి (40), ఏడాది పాప వల్క లక్ష్మీ, కుర్సెంగ కిష్టుబాయి (23)లు ఇండ్లలోనే నీరు దొరకక మృతి చెందడం అందర్నీ కలిచివేసింది. 30కి పైగా మూగ జీవాలు సైతం మృతిచెందాయి. తిర్యాణి మండలానికి అతి సమీపంలో ఉండడంతో పశువుల కాపరులు గుర్తించి గ్రామంలోని ప్రజలకు చెప్పడంతో మూడు రోజుల తర్వాత బయటి ప్రపంచానికి తెలిసింది. దీంతో ఐటీడీఏ, జిల్లా అధికారులు నీరు, ఆహారం తీసుకువచ్చి కుర్రెఘడ్‌లోని బాధిత కుటుంబాలను ఆశ్రమ పాఠశాలకు తరలించి పునరావాసం కల్పించారు.

పురోగతి లేని పునరావాస కాలనీ

వెంకటాపూర్ శివారు ప్రాంతంలో 18 కుటుంబాలకు పునరావాస కాలనీ నిర్మించారు. కానీ కాలనీ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించక పోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. రహదారి సౌకర్యం లేక వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి బయటి ప్రపంచానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అంతర్గత రోడ్లు, పక్కా ఇండ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

పనులు లేక పస్తులు : కుర్సెంగ లాలూ, కుర్రెఘడ్ పునరావాస కాలనీ

అధికారులు మాకు ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదు. వర్షాకాలంలో వ్యవసాయ కూలీ పనులు తప్ప మిగితా రోజుల్లో పనులు దొరకడం లేదు.

నెరవేరని హామీలు

ప్రతి కుటుంబానికి 5 ఎకరాలు, దున్నడానికి ఎద్దుల జతలు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు కేవలం 8 కుటుంబాలకు మాత్రమే 3 ఎకరాల సాగు భూమి ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇప్పటి వరకు కొందరికి రేషన్‌కార్డులు లేవు. కుర్రెఘడ్‌లో ఉన్నప్పుడు ఒక్కో కుటుంబానికి 10 ఎకరాల చొప్పున సాగు భూమి ఉండేది. తిండికి ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. మైదాన ప్రాంతానికి వచ్చిన తర్వాత ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. కుర్రె ఘాడ్ లోని 300 ఎకరాల భూమిని అటవీ శాఖ అధికా రులు స్వాధీనం చేసుకుని మొక్కలు నాటారు. మళ్లీ అక్కడకు వెల్లలేక ఇక్కడ ఉపాధి లేక అవస్థలు పడుతు న్నామని బాధితులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



దీంతో పూటగడవడమే కష్టంగా మారింది. భూములు ఇస్తే దున్నుకుని బతుకుతాం. రోడ్డు సౌకర్యం లేదు. ఒక్కటే నీటి పంపు ఉంది. ప్రభుత్వం పున రావాస కాలనీని అభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలి.

ఇళ్లు లేక అవస్థలు : వల్క గౌరుబాయి



ఇక్కడకు వచ్చినప్పుడు అధికారులు అందరికి పక్కా ఇండ్లు నిర్మిస్తామన్నారు. ఇప్పటి వరకు ఏ అధికారులు మమ్మల్ని పట్టించుకోవడం లేదు. మేమే సొంతంగా కట్టుకున్న ఇండ్లు వర్షాకాలంలో కురుస్తున్నాయి. పనులు కూడా దొరకడం లేదు. అధికారులు, నాయకులు స్పందించి పక్కా ఇండ్లను నిర్మించి ఇవ్వాలి.



బాధితులు నివసించే ఇళ్లు

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

ఇంటింటా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

మందమర్రిటౌన్, మే 8: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం రాత్రి మార్కెట్ సెంటర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల్లో జలకళ ఉంటే నేడు ఎండిపోయి ఉన్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థికి ఓట్లు వేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలంటే ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. రాజారామేష్, జె. రవీందర్, సంపత్, రాజశేఖర్, సంపత్, తిరుపతిరెడ్డి, సూరిబాబు, రాజ్‌కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

దండేపల్లి: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే ప్రజలందరు సుభిక్షంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. పలు గ్రామాల్లో కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కూలీల వద్ద ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ తోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. ఒకరేమో దేవుళ్లపై ఒట్లు వేసి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలం గడుపుతుంటే, మరోకరేమో దేవుడి పేరు చెప్పి ఓటు అడుగుతున్నారని అన్నారు. కాసిపేట చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. చుంచు శ్రీనివాస్, అనిల్‌కుమార్, అక్కల రవీందర్, బండారి మల్లేష్, మధు, తిరుపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ: పట్టణంలోని 35వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ అండే, నాయకులు జగన్, సుధాకర్, అశోక్ పాల్గొన్నారు.

హాజీపూర్: ముల్కల్లలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. నాయకులు గుణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ఎంపీపీ లక్ష్మీకి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట, మే 8: కాసిపేట ఎంపీపీ రొడ్డ లక్ష్మీ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, నర్సింగం, రౌతు సత్తయ్య, రవి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణానికి చెందిన కౌన్సిలర్లు ఎలిగేటి సుజాతశ్రీనివాస్, పోలు ఉమాదేవిశ్రీనివాస్, తుంగపల్లి సుజాతలతోపాటు వంద మంది బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా సాగాలన్నారు.

భీమారం: మండంలోని ఖాజీపల్లిలో ఎంపీటీసీ పెద్దల రూప, రాష్ట్ర గొర్రె మేకల సంఘం అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్‌లు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. రాకేష్, రాజేష్, బానేష్, మహేందర్, సంతోష్, నరేందర్, రామయ్య, బుగ్గయ్య, లక్ష్మీ,బుచ్చక్క, పాల్గొన్నారు.

దండేపల్లి: పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించుకుద్దామని నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య అన్నారు. పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నేతకాని సమాజాన్ని పట్టించుకోలేదన్నారు. నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన చేశారన్నారు. జుమ్మిడి విశ్వనాథ్, జాడి ప్రేమ్‌సాగర్, టెకుమట్ల లక్ష్మణ్, శంకరవ్వ, చిన్నక్క, అనసూయ పోషన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

కెరమెరి, మే 8: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. వైస్ఎంపీపీ కలాం ఆధ్వర్యంలో గ్రామాల్లో గత ప్రభు త్వం హయాంలో జరిగిన సంక్షేమ ఫలాలు చూసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రచారం చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

బెజ్జూరు, మే 8: బెజ్జూరు గ్రామ పంచాయతీ పరిధిలోని హేటిగూడ గ్రామానికి చెందిన మాడే అమ్మక్క బుధవారం రాత్రి మృతిచెందింది. దీంతో మృతురాలి కుటుంబాన్ని బీజేపీ నాయకులు పరామర్శించి ఆర్థికసహాయం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి, మహేష్, రమేష్, ఎ.తిరుతి, శంకర్, రాములు, రమేష్, పోశన్న, శంకర్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

ఆసిఫాబాద్‌రూరల్, మే 8: ఆసిఫాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఆధ్వర్యంలో బాబాపూర్, కాప్రీగ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించగా, మాజీఎంపీపీ బాలేష్‌గౌడ్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ గాదవేణి మల్లేష్ ఆధ్వర్యంలో సాలెగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేష్‌గౌడ్, శ్యాం, మురళీ, మంగ పాల్గొన్నారు.

ప్రచారానికి మిగిలింది ఇంకా మూడు రోజులే

● ప్రచారవేగాన్ని పెంచిన ఆయాపార్టీల నాయకులు ● చేరికలపై దృష్టిసారిస్తున్న ప్రధానపార్టీలు ● చివరి అస్త్రాలను సంధిస్తున్న అభ్యర్థులు ● అన్ని పార్టీలకు అగ్ని పరీక్షగా జిల్లా ఓటర్లు



కాగజ్‌నగర్, మే 8: పార్లమెంటు ఎన్నికల పోరు చివరి అంకానికి చేరుకుంది. ప్రచారపర్వం ముగింపునకు ఇంకా మూడు రోజులే ఉండటంతో ఆయాపార్టీల అభ్యర్థులు, నాయకులు తమ కార్యకర్తలతో కార్నర్ మీటింగ్, ఆయా వార్డుల ప్రజలతో విస్తృతస్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నారు. గడియ తీరిక లేకుండా పల్లెలు, పట్టణాల్లో సమాశాల్లో పాల్గొంటున్నారు. ఇంటింటా కరపత్రాల పంపిణీ చేపడుతున్నారు. అలాగే పోలింగ్‌బూత్ వారీగా సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు పెట్టేస్తున్నారు. ఉదయం పల్లెల్లో, సాయంత్రం పట్టణాల్లో మకాం వేసి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరో మూడు రోజులు గడువు మాత్రమే ఉండటంతో ప్రచార పర్వాన్ని పదునెక్కిస్తున్నారు. ఓటర్ల మనసును గెలుచుకునేందుకు అవసరమైన చివరి అవకాశాలను వినియోగించుకుంటున్నారు. ఏవర్గాన్ని విస్మరించకుండా అందరినీ కలుస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

పెరుగుతున్న చేరికలు..

కొన్నాళ్లుగా స్తబ్దుగా ఉన్న ప్రచారం ఒక్కసారి ఊపందుకుంది. భారీ సభలు, ముఖ్యనేతల రాకతో ఒక్కసారిగా రాజకీయ వాతావరం వేడెక్కింది. పార్టీలో చేరాలంటూ ద్వితీయశ్రేణి నాయకుల ఇంటికి వెళ్లి మంతనాలు చేస్తున్నారు. ఫోన్లలో సంప్రదింపులు చేస్తున్నారు. గ్రామాల్లో ఓటర్లను ప్రభావితం చేయగలిగే వారి కోసం గాలం వేస్తున్నారు. తమపార్టీల వైపు తిప్పుకునేందుకు ముమ్మర ప్రయ త్నాలు చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాల ఖర్చుల విషయంలో ఏ మాత్రం వెనుకంజ వేయటం లేదు.

సామాజిక వర్గాల ఓట్ల కోసం..

ఈ సారి జరిగే ఎంపీ ఎన్నికల కోసం ప్రధాన పార్టీల నాయకులు సామాజికవర్గాలపై దృష్టిసారించారు. ఇందుకు ప్రత్యర్థి పార్టీలకు దీటుగా వీలైనన్నీ ఎక్కువ ఓట్లను కొల్లగొట్టే ప్రణాళిక రూపొందిస్తున్నారు. గెలిచాక తప్పకుండా సాయం చేస్తామని హామీలిస్తూ గుంపగుత్త ఓట్లు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

అన్ని పార్టీలకు అగ్ని పరీక్షే..

ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాలకు చెందిన ఓట్లు ఎంపీ అభ్యర్థి గెలుపు ఓటములకు కీలకంగా మారనున్న దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ నుంచి ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, సిర్పూరు, కౌటాల, బెజ్జూరు మండలాల్లో కార్యకర్తలతో విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నారు. సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీలో ప్రజల చేరికలపై దృష్టిసారిస్తున్నారు. ఇక బీఆర్ఎస్‌లో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఈ జిల్లా వారే కావటంతో ఓటింగ్ శాతం పెంచటంతో పాటు మెజార్టీ కోసం కృషి చేస్తున్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో కార్యకర్తలతో విస్తృతసాయి సమావేశాలు నిర్వహించారు. బీజేపీలో అసెంబ్లీస్థానం డాక్టర్ హరీష్‌బాబు కైవసం చేసుకోవటంతో తనకున్న బలగాన్ని మరింత పటిష్టం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే హరీష్‌బాబు కార్నర్ మీటింగ్‌లు పెడుతున్నారు. తమ క్యాడర్, పార్టీపై ఉన్న అభిమానాన్ని కూడగట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా ఓట్లు మూడు పార్టీల నాయకులకు అగ్నిపరీక్షంగా మారనున్నాయి.

బీజేపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



దహెగాంలో పూలమాల వేసి ఎమ్మెల్యే హరీష్‌బాబును స్వాగతం పలుకుతున్న మహిళ

దహెగాం, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని ఇట్యాల, బోర్లకుంట, కోత్మీర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల తరువాత ప్రతి నిరుపేద కుటుంబానికి ఇండ్లు కట్టిస్తామన్నారు. బొక్కివాగు ప్రాజెక్టు నిర్మాణానికి కృషిచేస్తానని, అసంపూర్తిగా ఉన్న జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. అలాగే దహెగాం-భీమిని రహదారి నిర్మాణానికి కృషి చేస్తాని అన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లిలో బీజేపీ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు మట్లాడుతూ రానున్న పార్ల మెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అధికమెజార్టీతో గెల్పించాలని కోరారు. బీజేపీజిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీజేపీకి అధిక మెజార్టీ వచ్చేటట్లు చూడాలన్నారు.

● పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అధిక మెజార్టీతో గెల్పించేందుకు అంతా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బ్రహ్మయ్య మాదిగ, జల్లంపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. బుధవారం వారు స్థానికంగా మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి బ్రహ్మరథం పట్టాలన్నారు.

పెంచికలపేట: మండలంలోని దరగపల్లి,పోతెపల్లి, చెడ్వాయి గ్రామంలో బుధవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి గోడం నగేష్‌ను కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజన్న, నగేష్, బ్రహ్మయ్య, నానయ్య, పోచన్న పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు గొడెం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి, ఆర్ తిరుపతి, విజయ్, రమేష్ పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని పెద్దదొబ్బ, చిన్నదొబ్బ, బాబ్జీపేట్, గుట్టగూడ తదితర గ్రామాల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గెడం శంభు ప్రచారం నిర్వ హించారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుండ న్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఆత్రం మనోహర్, మర్సుకోల మానిక్‌రావు, కనక సీతారాం, మెస్రం దత్తు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పాటుపడింది బీఆర్ఎస్

● ఎమ్మెల్సీ దండె విఠల్



కౌటాలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కౌటాల, మే 8: ప్రజాసంక్షేమానికి పాటుపడింది కేవలం బీఆర్ఎస్ పార్టీయేనని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జగదంబ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజలు అభివృద్ధిచేసే పార్టీని గుర్తించాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల న్నారు. అనంతరం మాజీ సర్పంచ్ పొరెత్ పత్రు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో జడ్పీటీసీ పుష్ప లత, నాయకులు ఉమామహేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి

కాగజ్‌నగర్: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు అధిక మెజార్టీతో గెల్పిం చాలని ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ కోరారు. మంగళవారం రాత్రి పటేల్ గార్డెన్‌లో పట్టణ, మండల కార్యకర్తలతో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాల వారికి పెద్దపీట వేసి ఆదుకున్నట్లు తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ కూడా అమలు కాలేదన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తానన్నారు. తనను గెల్పిస్తే రానున్న రోజుల్లో జిల్లాను అభివృద్ధి బాటలో నడిపిస్తానని పేర్కొన్నారు. అదేవిధంగాయోగా సెంటర్‌లో దండేవిఠల్ ప్రచారం చేశారు అనంతరం ఎస్పీఎం క్రీడా మైదానంలో వాకర్స్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, తిరుపతి, లెండు గురే శ్యాంరావు, మోయిన్, నక్క మనోహర్, షబ్బీర్ హుస్సేన్, మండల, పట్టణాల బాధ్యులు పాల్గొన్నారు.

పెంచికలపేట: సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిన ఘనత కేసీఆర్‌దేనని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలన్నారు. ఇప్పటికీ ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీపై, కేసీఆర్‌పై ఆదరణ, ప్రేమ తగ్గలేదన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లా డుతూ ప్రజా సమస్యలపై నిరంతరం బీఆర్ఎస్ పోరా డుతుందన్నారు. ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపిం చాలని కోరారు.అనంతరం వివిధ గ్రామాల నుంచి పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

వాంకిడి: మండలంలోని సార్కెపల్లి, పాకిడిగూడ, మారెపల్లి, లైన్‌గూడ గ్రామాల్లో జడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయ కులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ ఎంపీ అభ్యర్థి ఆత్రంసక్కును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిష్టు, భీంరావు, బాలు, గంగారాం, రాము, తదితరులున్నారు.

పెంచికలపేట: మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో బుధవారం బీఆర్ఎస్‌నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శంకర్‌గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్షార్పణం..



- వరి, మామిడి రైతులకు తీవ్ర నష్టం
- చేతికొచ్చే సమయంలో నీటిపాలైన పంట
- జిల్లాలో 2500 ఎకరాల్లో నష్టం
- ప్రాథమిక అంచనా తయారు చేసిన అధికారులు

మంచిర్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో మంగళ వారం కురిసిన అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. మధ్యాహ్నాం సమ యంలో ఉరుములు, గాలి దుమారంతో కూడిన వర్షం పడటంతో చేతి కొచ్చిన వరి, మామిడి నీటి పాలైంది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దకాగా, రైస్ మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు కూడా తడిసి పో యాయి. జిల్లాలోని భీమిని, నెన్నెల, భీమారం మండలాల్లో కోతకు వచ్చిన మామిడికాయలు నేల రాలాయి.

వేల ఎకరాల్లో పంటకు నష్టం

జిల్లాలో వేల ఎకరాల్లో వరి, మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవ సాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక నివేదికలు తయారు చేశారు.

- 1525 మంది రైతులకు చెందిన 2308 ఎకరాల్లో నష్టం వరి పంటకు నష్టం వాటిల్లింది. నష్టం విలువ సుమారు రూ. 28 లక్షల 99వేల 800 ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.
- మామిడి పంటకు 112 మంది రైతులకు చెందిన 247.20 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఇప్పటికే చాలా మంది రైతులు మామిడికాయలు కోసినందున తక్కువ నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎకరాకు కనీసం రెండు టన్నుల మేర నష్టం వాటిల్లినా దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. అయితే తుది అంచనా రిపోర్టు తయారు చేసి, త్వరలో ప్రభుత్వానికి అందజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలు

అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అదనపు కలెక్టర్ మోతీలాల్ తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం పూర్తిగా తడిసినందున మళ్లీ ఆరబెట్టాలని రైతులకు సూచిస్తున్నారు. ఇప్పటి వరకు రోజుల తరబడి కళ్లాల్లో పడిగాపులు కాసి ఆరబెట్టిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టాలనడంతో రైతులు అసహనానికి గురవుతున్నారు. ఆరబెట్టిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేసి, మిల్లులకు తరలించాల్సి ఉండగా మిల్లర్ల నిర్లక్ష్యం, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల జాప్యం కారణంగా రైతులు నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.పంట చేతికొచ్చే దశలో నష్ట పోయినందున ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాలని రైతుల రాస్తారోకో

వేమనపల్లి: మంచిర్యాల జిల్లా వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం రైతులు రాస్తారోకో చేశారు. మండలంలో మంగళ వారం కురిసిన వడగండ్ల వానకు పంటలు నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహా రం అందించాలని తహసీల్దార్ కార్యాల యం ఎదుట దెబ్బతిన్న పంటతో రాస్తారోకో చేశారు. రైతులు మాట్లాడుతూ అకాల వర్షానికి వందలాది ఎకరాల్లో వరి పంట తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట నేలపాలైనప్పటికీ వ్యవసాయశాఖ అధికారులు సర్వే చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సర్వే చేయించి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. మాజీ ఎంపీపీ కుర్ర వెంకటేశం, రవి, అశోక్, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, కుమార్, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఓట్లు వేయండి.. సమస్యలు పరిష్కరిస్తాం

రాజారం గ్రామస్థులతో అదనపు కలెక్టర్ మోతిలాల్



రాజారం గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

కోటపల్లి, మే 8: ఎన్నికలను బహిష్కరించవద్దని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే కీలకమని, ఓట్లు వేయండి సమస్యలను పరిష్కరిస్తామని బుధవారం రాజారం గ్రామస్థులతో అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గ్రామ సమస్యలు పరిష్కరించే వరకు ఓట్లు వేయమని, ఎంపీ ఎన్నికల్లో పాల్గొనేది లేదంటూ గ్రామస్థులు తీర్మానించిన విషయం తెలిసిందే. రెండు దఫాలుగా అధికారులు గ్రామస్థులతో సమావేశమై చర్చలు జరిపినా వారు ఓట్లు వేసేందుకు ససేమిరా ఒప్పుకోకపోగా, పోల్ చిట్టీల పంపిణీని బహిష్కరించారు. బుధవారం అధికారుల బృందం మరోసారి గ్రామస్థులతో చర్చలు జరిపింది. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, అయితే అటవీ అనుమతుల కోసం నివేదిక పంపామని లేఖను అదనపు కలెక్టర్ గ్రామస్థులకు చూపించారు. ఓట్లకు దీనికి లింకు పెట్టవద్దని, ఎన్నికల తర్వాత ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎవరు గెలిచినా వారి వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించుకుందామని, ఇందుకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఓట్లు వేసే విషయంపై అందరం కలిసి నిర్ణయం తీసుకుంటామని గ్రామస్థులు తెలిపారు. పోల్ చిట్టీలు మళ్లీ ఇవ్వరని తెలుపడంతో పోల్ చిట్టీలు తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేశారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో భూమన్న, తహసీల్దార్ మహేందర్, సీఐ సుధాకర్, ఎస్‌ఐ రాజేందర్, కార్యదర్శి రమ పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

మంచిర్యాల కలెక్టరేట్, మే 8: జిల్లాలో వాతావరణం బుధవారం చల్లబడింది. మంగళవారం పలు జిల్లల్లో కురిసిన ఈదురుగాలులు, వర్షం, వడగండ్ల వానతో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. జన్నారంలో 40.0 డిగ్రీలు, దండేపల్లి, భీమినిలో 39.9, మంచిర్యాల, చెన్నూరులో 39.7, లక్షెట్టిపేట, కాసిపేటలో 39.1, బెల్లంపల్లి, కోటపల్లిలో 39.0, హాజీపూర్‌లో 38.8, నస్పూర్, కన్నెపల్లి 38.7, నెన్నెలలో 38.4, జైపూర్‌లో 38.3, మందమర్రిలో 38.1, భీమారంలో 37.8, వేమనపల్లిలో 37.7, తాండూర్‌లో 37.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు



మంచిర్యాల, శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు ప్రేంసాగర్‌రావు, వివేక్, ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ

ఏసీసీ, మే 8: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా దేశాభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాలులో మంచిర్యాల నియోజకవర్గ స్థాయి యువ సమ్మేళనంలో ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణలతో కలిసి పాల్గొన్నారు. ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మహిళలు, యువత అనుకుంటే ఏదైనా సాధ్యపడుతుందన్నారు. కొన్ని పార్టీలు మతం, కులం పేరిట రాజకీయాలు చేస్తున్నాయన్నారు. మంచిర్యాలలోనే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యనందిస్తామన్నారు. ఎమ్మెల్యే గడ్డం వివేకానంద మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థల యాజమానుల కోసం పనిచేస్తే రాష్ట్రంలో కేసీఆర్ ప్రైవేటు కాంట్రాక్టర్ల కోసం పనిచేశారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ వస్తే బతకులు మారుతాయని యువత ఆశించదని కానీ అది నెరవేరలేద న్నారు. డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, పట్టణాధ్యక్షుడు నరేష్, బ్లాక్ అధ్యక్షుడు తిరుపతి, మున్సిపల్ చైర్మన్లు ఉప్పలయ్య, సుర్మిళ్ల వేణు పాల్గొన్నారు.

సింగరేణికి అన్యాయం చేసిన కేసీఆర్

శ్రీరాంపూర్: తెలంగాణ సాధన కోసం 35 రోజులు కార్మికులు సమ్మె చేస్తే రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ సింగరేణికి అన్యాయం చేశారని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. గడ్డం వంశీకృష్ణకు మద్ద తుగా ఎస్‌ఆర్‌పి 1, 3, ఆర్‌కె 5, 6 గనులపై ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ రిటైర్‌మెంట్, రిట్రెంచ్‌మెంట్ మాత్రమే అమలు చేశారని, రిక్రూట్ మెంట్ చేయలేదన్నారు. ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ మాట్లాడుతూ, ఇద్దరు ఎంపీలతో తెలంగాణ తెచ్చామని చెప్పిన కేసీఆర్ పది మంది ఎంపీలున్నా కార్మికుల ఆదాయపు పన్ను ఎందుకు రద్దు చేయించలేదని ప్రశ్నించారు. ఆర్‌కె 5, 6 గనులపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు వివేక్, వంశీకృష్ణ, సీతారామయ్య, జనక్‌ప్రసాద్ మాట్లాడారు.

కోటపల్లి: కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన జరుగుతుందని, ప్రజ లంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ అన్నారు. పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

లక్షెట్టిపేటరూరల్: గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. మోదెల, ఉత్కూరు, ఇటిక్యాలలో ప్రచారం చేశారు.

కన్నెపల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ప్రచార సభలో ఆయన మాట్లాడారు.

అందరూ ఓటు వినియోగించుకునేలా..



జైపూర్, మే 8: ఓటును అందరు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి వినియోగించుకోలేరు. ఎన్నికల విధుల్లో ఉన్నవారు, సైనికులు, గూఢచారి వ్యవస్థలో పనిచేసే వారు తమ ఓటును ఉపయోగించుకునేందుకు వివిధ మార్గాలను ఎన్నికల సంఘం కల్పించింది.

ఈడీసీ ద్వారా..

తమ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అదే కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించారు.

అలాంటి వారు ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) తీసుకుని తాము విధులు నిర్వహించే పోలింగ్ కేంద్రం లోనే ఓటు హక్కు వినియోగించుకుంటారు.

సర్వీసు ఓటు

దేశ రక్షణలో ఉన్న సైనికులు, పారా మిలటరీ ఉద్యోగులు విధి నిర్వహణలో సుదూర ప్రాంతాల్లో ఉంటారు. వీరు తమ స్వస్థలంలో ఓటు హక్కును వినియోగించుకోలేరు. వీరికి సర్వీసు ఓటు హక్కును కల్పించింది ఎన్నికల సంఘం.

ఎన్నారైలకు..

భారతీయ పౌరసత్వం ఉండి విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం ఇతర దేశాలకు వెళ్లి అక్కడే ఉంటున్నవారు ఉన్నారు. అలాంటి వారి కోసం ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది ఎన్నికల సంఘం. వీరికి ఫారం-6ఏ ద్వారా ఓటు హక్కును కల్పిస్తుంది. ఇందుకు వీరు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, వీసా, పాస్‌పోర్టు జిరాక్స్ తదితర వాటిని సమర్పించి ఓటు హక్కును నమోదు చేసుకుని తర్వాత పోలింగ్ రోజు వచ్చి ఓటు వేయాల్సి ఉంటుంది.

ప్రాక్సీ ఓటు ...

దీన్ని పరోక్ష ఓటు అంటారు. గూఢాచారి, ఇంటెలిజెన్స్ వారు వినియోగించుకుంటారు. తమకు బదులు ఇంకొకరిని పంపి ఓటు వేయిస్తారు. తమకు ప్రాక్సీ ఓటు వేసే అవకాశం కల్పించాలని ఎన్నారై సంఘాలు కోరుతున్నాయి.

టెండరు ఓటు

ఎన్నికల రోజు వరకు ఓటరు జాబితాలో పేరు ఉండి, పోలింగ్ కేంద్రం వద్ద గల్లంతు కావడం, తమ పేరున ఉన్న ఓటును వేరే వారు వేయడం లాంటి పరిస్థితుల్లో వారికి ఓటేసే అవకాశం కల్పిస్తారు. ఈ సమయంలో ఓటరు తాను అంతకుముందు ఓటు వేయలేదని నిరూపించుకోవాలి. అప్పుడు టెండరు ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు అనుమతి ఇస్తారు.

సాధారణ ఓటు

భారత రాజ్యాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటురుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీనిని సాధారణ ఓటు అంటారు. ఇలా నమోదు చేసుకున్న వారు పోలింగ్ రోజు తమ గుర్తింపు కార్డులు చూపించి ఓటు వేయవచ్చు.

పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో భాగంగా ఉద్యోగులు తమ నియోజకవర్గ పరిధిలో కాకుండా ఇతర చోట్ల విధులు నిర్వహిస్తుంటారు. వారి కోసం ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది.

అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 8: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీ వినతిపత్రం అందించారు. జిల్లాలో కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు కనీస సౌకర్యాలు, ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్నాయన్నారు. తల్లిదండ్రులను మోసం చేస్తూ పెద్ద ఎత్తున ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే ఈ కళాశాలలపై తనిఖీలు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

జన్నారం, మే 8: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాళ్లపెల్లి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జన్నారంలో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోళ్లలో ఆలస్యం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళనలు చేస్తామన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

కోటపల్లి, మే 8: మండలంలో కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాళ్లబండి శ్యాంసుందర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చేతికి వచ్చిన పంటతోపాటు కల్లాల్లో ఉన్న ధాన్యం తడవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 8 : జిల్లా కేంద్రంలో బుధవారం ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం వృద్ధాశ్రమంలో పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి వృద్ధులకు డాక్టర్‌లు తిరుమల్‌రావు, శ్రీధర్‌లు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం రక్తనిధి కేంద్రంలో కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరం నిర్వహించి 30 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా శాఖ వైస్ ఛైర్మన్ సతీష్, కార్యదర్శి మహేందర్, సత్యపాల్‌రెడ్డి, కిషన్, శ్రీనివాస్, సత్యనారాయణరావు, సత్యనారాయణరెడ్డి, సంతోష్‌కుమార్, పాల్గొన్నారు.

నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలి

మందమర్రిటౌన్, మే 8: ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలని జిల్లా ఎరుకల సంఘం అధ్యక్షుడు దుగ్యాల బాపు పేర్కొన్నారు. బుధవారం మందమర్రిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామానుజపురం గ్రామంలో ఈనెల 23న నాంచారమ్మ జాతరను జరుగుతుందని, జాతరకు పెద్ద సంఖ్యలో ఎరుకల కులస్థులు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రవి, సంపత్, రాజమల్లు, సంజీవ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా కృషి



విద్యార్థులతో ఆర్డీవో, డీఈవో

ఏసీసీ, మే 8: విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా జిల్లా సైన్స్ కేంద్రం కృషి చేస్తోందని ఆర్డీవో వడాల రాములు అన్నారు. బుధవారం జిల్లా సైన్స్ కేంద్రంలో విద్యార్థులకు నిర్వహించిన సైన్స్ సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో అతిథిగా పాల్గొని మాట్లాడారు. 12 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో విజ్ఞానాన్ని ప్రయోగాత్మక నైపుణ్యాన్ని పెంపొందిస్తూ అనేక అంశాలను నేర్పిస్తుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి వాటి పనితీరును తెలుసుకున్నారు. ఆటోమేటిక్ వాటర్ ఇన్ సిస్టం ఫర్ అగ్రికల్చర్ పరికరం ద్వారా వ్యవసాయదారులు ఇంటి వద్దనే ఉంటూ పొలంలో పంటకు సరిపడ నీటిని సరఫరా చేసే విధా నాన్ని కొనియాడారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ విద్యార్థులు రూపొందించిన బ్యాంకింగ్ సెక్యూరిటీ సిస్టం, కొండలు, గుట్టలు మూల మలుపుల వద్ద వాహనాలను ముందుగానే పసిగట్టేలా చేసిన పరికరం, కోతులు, పందులు పంట పొలాలను నాశనం చేయకుండా పరికరాలు సమాజానికి ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి మధు బాబు, సెక్టోరల్ అధికారి చౌదరి, డీటీ శ్రీహరి, రాజేశ్వర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల సమస్యలను పట్టించుకోని బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

బెల్లంపల్లి, మే 8: పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సామాన్యులను పట్టించుకోలేదని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం బెల్లంపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లతో అధికారం చేజిక్కించుకున్న ప్రధాని మోదీ, అమిత్ షాలు ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపై అనేక పన్నుల భారం మోపిందని, కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్ల పన్నులను మాఫీ చేసిందన్నారు. దేశంలో 75 శాతం పిల్లలు పౌష్టికాహార లోపంతో జీవిస్తున్నారని, రైతులు రుణాలు మాఫీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజల మధ్య ఉన్న అసమానతలను తొలగించి ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. దేశంలో 24 కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక అల్లాడుతు న్నారని, 18 కోట్ల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయన్నారు. తెలంగాణలో 15 బిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు గుర్తించామని, బీజేపీ తీసుకువచ్చిన నిబంధనల వల్ల వేలంలో పాల్గొని పన్నులు చెల్లించి కొనే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. పెద్దపల్లి పార్ల మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీ కృష్ణను గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



పారుపెల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్


కోటపల్లి, మే 8 : పారుపెల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ మోతిలాల్ తనిఖీ చేశారు. ధాన్యాన్ని పరిశీలించిన ఆయన వెంటనే కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. రెండు రోజులుగా మబ్బులు ఉండి వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక సహకార పరపతి సం ఘం, డీఆర్‌డీఏకు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చిందని ఆరా తీశారు. పౌరసరఫరా అధికారులు, డీసీఎంఎస్ అధికారులు ధాన్యాన్ని తరలించాలని పేర్కొన్నారు. రాజు, వెంట వికాస్, పోచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేయాలి

కాసిపేట, మే 8: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న విద్యుత్, శానిటేషన్, తదితర మరమ్మతు పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని డీఈవో యాదయ్య అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం గోండుగూడ, మల్కేపల్లి, చింతగూడెం, గురువాపూర్ పాఠశాలతోపాటు కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా అంతకుముందే పనులను పూర్తి చేయాలన్నారు. నాణ్యతతో పనులు జరిగేలా చూడాలన్నారు. సెక్టోరల్ అధికారి చౌదరి, సీసీవో రాం బాబు, డీఆర్‌పీ రమేష్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

13న ప్రజాస్వామ్య పండుగకు రండి..

- అందరూ ఓటు వేయాలంటూ ఆహ్వాన పత్రిక
- సోషల్ మీడియా ద్వారా వైరల్



దండేపల్లి, మే 8: ఓటు హక్కు కలిగి ఉన్న వారందరు ఓటు వేయడానికి రావాలంటూ ప్రజాస్వామ్య పండుగ పేరిట ముద్రించిన ఓ ఆహ్వాన ప్రతిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈనెల 13 సోమవారం జరిగే లోక్‌సభ ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగగా అందులో పేర్కొన్నారు. ఓటర్లందరూ కుటుంబసభ్యులతో కలిసి తప్పసరిగా ఓటు వేసేందుకు తరలిరావాలని కోరారు. పోలింగ్ వేళను వేడుక సమయం, పోలింగ్ స్టేషన్‌ను వేదికగా, ఐదేళ్ల ప్రజాస్వామ్య ఫలాలను విందుగా సూచించారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే ఆహ్వాన ప్రతిక రూపొందించినట్లు చివరలో పేర్కొన్నారు.

సారంగపల్లిలో ధాన్యం తరలింపు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



లారీలో ఎక్కిస్తున్న ధాన్యం

మందమర్రిరూరల్, మే 8: ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లాయిడ్‌లో ఈ నెల 6న ధాన్యాన్ని తరలించాలి అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. అధికారులు బుధవారం సారంగపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి లారీని పంపించారు. కొనుగోలు కేంద్రంలోని లారీలో ధాన్యం లోడ్ చేసి తరలించారు. త్వరగా లారీలు పంపంచి ధాన్యం మొత్తాన్ని తరలించాలని రైతులు కోరుతున్నారు.